# "సెట్టివారి 'దొంగ' - నేనూ"

మనం చాలాసార్లు ఏమో చేయాలని వెళ్లి వేరేమో చేసొస్తూంటాం..... దానిక్కారణాలు సవాలక్ష...

అనుకున్న పనిగాక యింకో పనేదో చేసొచ్చిన తర్వాత దాని పరిణామం మాత్రం సరదా అనుభవాన్నే మిగులుస్తుందన్నది నా అనుభవం (ఇది సార్వజనీనం కానక్కర్లేదు)

నారాయణ అని ఓ వ్యక్తి నా దగ్గర లక్ష రూపాయలు అప్పు తీసుకున్నాడు. వడ్డీ ఆశకు అప్పిచ్చా... సరే రెండు రూపాయల వడ్డీ కింద లక్షకి పత్రం రాయించి నెలనెలా రెండువేలిచ్చేట్టుగా నారాయణ లక్ష పట్టుకెళ్లాడు.

నాలుగు నెల్లు క్రమం తప్పకుండా వడ్డీ ఇంటికి తెచిచ్చాడు. అయిదో నెల రెండో వారంలో కనబడి "వచ్చేవారం యిస్తా సార్ కొంచెం టైట్‌గా వుంది" అన్నాడు.

"ఆహా హీహీ...అబ్బే పర్లేదండి" అని నేను... వడ్డీ నెలచివర్లో తెచ్చిచ్చాడు... "సారీ సారీ సారీ" అని. "అరెరే భలేవారే దాందేముంది పర్లేదు ఇట్సాలైట్ నెవ్వర్మైండ్" అన్నాను.

ఇక షురూ... రెణ్ణెలకోమాటు... నాలుగు నెల్లకోమాటు...నేనతని దుకాణం చుట్టూ తిరగడం... దుకాణంలో గుమాస్తా "సార్లేడు, ఎక్కడికి పోయినాడో తెలీదు... ఎప్పుడొస్తాడో తెలీదు" అనడం... ఎప్పుడైనా ఎక్కడేనా రోడ్డుమీద నారాయణ దొరికితే నేను నిలదీయడం... అతను సవాలక్ష కారణాల్తో సంజాయిషీలివ్వడం.

మా జయక్క విసిగిపోయి "వాడి వడ్డీ వద్దూ ఏమీ వద్దూ అసలు యిప్పించుకురాపో" అనేసింది. ఇంటికి వెళ్తే మనిషి దొరకడు. భార్య నడిగితే 'ఎప్పుడొస్తాడని' "పెద్దామె నడగండి" అని సమాధానం. ఆయనగారికి రెండు కాపురాలు... దర్జాగా అప్పులు చేసి మరీ నడుపుతున్నాడు. ఇంట్లో దొరకడు దుకాణంలో దొరకడు. ఉదయం చాలా త్వరగా ఇంట్లోంచి వెళ్లిపోతాడు. మళ్లీ ఎప్పుడో బాగా రాత్రి అయ్యింతర్వాత వస్తాడు.

సరేనని ఓ నిర్ణయానికొచ్చి ఓ రాత్రి పదకొండు ప్రాంతంలో ఓ రెండు రౌండ్లు వేసుకుని అమీతుమీ తేల్చుకోడానికి నారాయణింటికెళ్లా.

అప్పటికే అక్కడ గొడవ. నాలాగే ఓ ముగ్గురు నారాయణ బాధితులు... వాళ్లూ నాలాగే తెగబడి వచ్చారు. ఓ గొడవ... అరుపులు... తిట్లు... బండబూతులు...రంగం వేడెక్కుతోంది. యిక యే క్షణాన్నైనా నారాయణ మీద దాడి జరగొచ్చు. నాకా పరిస్థితిలో

ఏం చేయాలో దిక్కుతోచలేదు. నారాయణ్ణి చూస్తే జాలేసింది. నేను ముందు పడి ఆ ముగ్గురితోటీ మాట్లాడి శాంతపరచి... తంటాలుపడి వాళ్లని పంపించివేసా.

నారాయణ నాకు మొక్కని మొక్కులేదు.

మనం గర్వంగా ఛాతీపెంచి వెనక్కొచ్చేసాము.

అదీ సంగతి. ఆ తర్వాత ఓ రెండేళ్లకి ఎనభైవేలు జమచేశాడు నారాయణ. యింకా ఆ ఇరవైవేలూ బొక్కే

* * *

పై సంఘటన తల్చుకున్నప్పుడంతా నాకు సెట్టి లక్ష్మీనరసింహ కథ 'దొంగ' గుర్తుకొస్తుంది. ఎవరీ లక్ష్మీనరసింహం అని యిప్పటి పాఠకులు చాలామంది అడగొచ్చు.

వెనకటితరం రచయితల్లో నలుగురు లక్ష్మీనరసింహం పేరుతో ప్రసిద్ధులు. చిలకమర్తి, సెట్టి, పానుగంటి, కూచి...

పై చెప్పిన సెట్టి లక్ష్మీనరసింహంగారి దొంగ కథ టూకీగా చెబుతాను. కృష్ణుడనే వాడు జైలు కాపలావాడు. తన ఏమరుపాటుతో ఖైదీ తప్పించుకోడంతో శిక్షపడి ఉద్యోగం పోగొట్టుకుంటాడు. మూణ్ణెళ్లు జైల్లో వుండి విడుదలౌతాడు. తర్వాత ఎక్కడా పని దొరకదు. కుటుంబాన్ని పోషించుకోడానికి దొంగతనం చేయాలని నిశ్చయించుకుంటాడు. ఓ సుబేదారింటికి రాత్రి దొంగతనానికెళ్తాడు. అక్కడ సుబేదారు భార్య. పనిమనిషి మాత్రముంటారు. ఇంటి వారబ్బాయికి తీవ్ర అనారోగ్యంగా ఉంటుంది. యజమానురాలు పనిమనిషిని డాక్టరు దగ్గరికెళ్లమంటే ఆమె అంతరాత్రి వెళ్లడానికి నిరాకరిస్తుంది. ఆ సమయంలో కృష్ణుడు కత్తి ఝుళిపిస్తూ వాళ్ల ముందుకు దూకి సొమ్ము కావాలి అని భయపెడ్తాడు. యజమానురాలు భయపడక ఒరే నాయినా పిల్లాడికి ప్రాణాల మీదికి వచ్చింది దయచేసి డాక్టర్ని పిలుచుకురా అని వేడుకొంటుంది. అసలే అమాయకుడూ మంచివాడైన కృష్ణుడు కరిగిపోయే వెళ్లి డాక్టర్ని పిలుచుకొచ్చి పిల్లాడిని బ్రతికిస్తాడు. తర్వాత కథ సుఖాంతం. పనిమనిషి రాధతో కృష్ణుడి పెళ్లి.

అదండీ కథ.

నేను నారాయణని వాయిద్దామని వెళ్లి నారాయణకే వత్తాసు పలికి రావడంపై చెప్పిన సెట్టి లక్ష్మీనరసింహం కథలా లేదూ...

* * *

***శ్రీ తిరుమల రామచంద్రగారు 'సాహితీ సుగతుని స్వగతం' అన్న పుస్తకంలో పై కథను ప్రస్తావించి 'ఆంధ్ర వాఙ్మయంలో ఈ 'దొంగకు దొరతనం లభిస్తుంది' అని రాసారు. మళ్లీ ఈ తిరుమల రామచంద్ర ఎవరూ అని అంటారా? ప్చ్...*** ●